సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 28 । ఏప్రిల్ । 2023



మంచు.. ఎండ.. వర్షం

పాడేరు: భిన్న వాతావరణం నెలకొంది. ఉదయం మంచు, మధ్యాహ్నం ఎండ, సాయంత్రం వర్షం చోటుచేసుకుంది.



హెల్ప్‌లైన్ పోస్టర్ ఆవిష్కరణ

జాతీయ వృద్ధుల హెల్ప్‌లైన్ పోస్టర్‌ను డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా గురువారం ఆవిష్కరించారు. 8లో



అరకు కాఫీ అవుట్‌లెట్స్!

అరకు కాఫీ అవుట్‌లెట్స్ రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రధాన నగరాల్లో ప్రారంభించాలని గిరిజన సహకార సంస్థ భావిస్తోంది. 8లో

న్యూస్‌రీల్

ఏడీగా గణేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న గణేశ్వరరావు

డుంబ్రిగుడ: పశుసంవర్ధక శాఖ అరకు ఏడీగా సాగర గణేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏడీ అశ్వత్థామ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో గణేశ్వరరావును నియమించారు. ఈయన పరిధిలో అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, మండలాలు ఉన్నాయి. ఈ సందర్భంగా గణేశ్వరరావు మాట్లాడుతూ బాధ్యతను అంకితభావంతో చేపట్టి అందరికీ అందుబాటులో ఉండి సేవలందిస్తామన్నారు. వైద్యులు శీనయ్య, గౌతమ్, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. .

యోకోహామాలో ఎనిమిది మందికి ఉద్యోగాలు



అభ్యర్థులతో మాట్లాడుతున్న జిల్లా మేనేజర్ ప్రశాంత్‌కుమార్

సాక్షి,పాడేరు: ఏపీనైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఎనిమిది మందికి ఉద్యోగాలు కల్పించారు. స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాలిటెక్నిక్ కళాశాలలోని ఇండస్ట్రియల్ కస్టమైజ్డ్ స్కిల్ ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ డ్రైవ్‌లో భాగంగా గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. యోకోహామా టైర్ల కంపెనీ నిర్వహించిన జాబ్‌మేళాకు 34 మంది హాజరు కాగా వీరిలో ఎనిమిది మంది ఎంపికయ్యారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాత, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఎం.సతీష్‌కుమార్, ఏడీఎస్‌డీఈ పి.గంగాజీ అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు.

బడిబయట బాలికలను కేజీబీవీలో చేర్పించాలి

- జీఎస్‌డీవో సూర్యకుమారి



కొత్తూరులో విద్యార్థినులతో మాట్లాడుతున్న జీసీడీవో సూర్యకుమారి, కేజీబీవీ సిబ్బంది

అనంతగిరి: బడిబయట బాలికలను గుర్తించి కేజీబీవీ విద్యాలయాల్లో చేర్పించాలని జీసీడీవో సూర్యకుమారి సూచించారు. మండలంలోని కొత్తూరు కేజీబీవీ పాఠశాలను గురువారం సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడారు. అనంతరం కొత్తూరు గ్రామంలో పర్యటించిన ఆమె బడిబయట బాలికలను గుర్తించారు. కేజీబీవీ చేరాలని కోరారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, సౌకర్యాలపై తల్లిదండ్రులు, విద్యార్థినులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లోకి వెళ్లి, బాలికలను గుర్తించి, కేజీబీవీలో చేరేలా అవగాహన కల్పించాలని, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలోని కేజీబీవీ ప్రత్యేకాధికారి లత, ప్రమీల, భారతి, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

అధిక విద్యుత్ బిల్లులు వస్తే సంప్రదించండి

చింతపల్లి: సాంకేతిక సమస్యల కారణంగా అధికంగా వచ్చే విద్యుత్తు బిల్లులను తప్పనిసరిగా సవరణ చేస్తామని పాడేరు ఏపీఈపీడీసీఎల్ ఈఈ అప్పారావు, చింతపల్లి ఏఈ రమణ తెలిపారు. పెదబరడలో ఒక పూరిగుడిసెకు అధిక విద్యుత్ బిల్లు రావడంపై వారు స్పందించారు. సాంకేతిక సమస్య కారణంగా వచ్చిన బిల్లును పరిశీలించి రద్దు చేశామన్నారు. ఇలాంటి సమస్య ఎవరికైనా ఎదురైనప్పుడు తమను సంప్రదిస్తే విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.

పీఎంశ్రీ పథకానికి కొయ్యూరు ఆశ్రమ పాఠశాల

కొయ్యూరు: స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాల-1 పీఎం శ్రీ పథకానికి ఎంపికైందని హెచ్‌ఎం బీవీ మూర్తి తెలిపారు. దీంతో వృత్తి విద్యాకోర్సులైన కంప్యూటర్ విద్య, డిజిటల్ లిబ్రేరీ, గణితం ల్యాబ్, ఫిజిక్స్, రసాయనశాస్త్రం, బయోలజీ ల్యాబ్‌లు అందుబాటులోకి వస్తాయన్నారు. వీటితోపాటు క్రీడలను ప్రోత్సహించేందుకు వీలుగా ప్రత్యేక కోచింగ్ ఉంటుందని తెలిపారు. ఈ పాఠశాలలో ప్రవేశాలకు సంబంధించి మూడో తరగతిలో 80, నాలుగో తరగతిలో 60, ఐదులో 60 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. ఆరులో 40, ఏడవ తరగతిలో 25, ఎనిమిదవ తరగతిలో 40 సీట్లు ఖాళీలున్నాయని తెలిపారు. మే ఒకటి నుంచి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వివరాలకు తమ పాఠశాల సంప్రదించాలని ఆయన కోరారు.

అడుగంటిన జలం..


విద్యుత్ ఉత్పత్తికి విఘాతం

లోయర్ సీలేరు జలవిద్యుత్ కేంద్రాలను నీటి సమస్య వెంటాడుతోంది. ఫలితంగా విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ఐదేళ్లలో ఎన్నడూలేని విధంగా నీటి నిల్వలు అడుగంటిపోయాయి. డొంకరాయి జలాశయంలో ఇదే పరిస్థితి నెలకొనడంతో విద్యుత్ ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది.

- సీలేరు విద్యుత్ కాంప్లెక్సులో గడ్డు పరిస్థితి
- నిండుకుంటున్న జలాశయాలు
- పీక్ అవర్స్‌లో మాత్రమే ఉత్పత్తి



డొంకరాయి శాడిల్ డ్యామ్‌వద్ద అడుగంటిన నీటిమట్టం



డొంకరాయి జలాశయం మీద ఆధారపడిన పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం

మోతుగూడెం: లోయర్ సీలేరు జలవిద్యుత్ కేంద్రాలకు నీటి కొరత కారణంగా విద్యుత్ ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. ఐదేళ్ల కాలంలో ఇంతా తక్కువస్థాయికి నీటిమట్టాలు చేరుకోవడం ఎన్నడూ లేదని జెన్‌కో అధికారవర్గాలు చెబుతున్నాయి. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాయి. ఆంధ్రా, ఒడిశా ఉమ్మడి ప్రాజెక్టు బలిమెల జలాశయం నుంచి ఏపీ వాటా నీటిని పొదుపుగా వాడుకుంటూ అవసరమైన సమయంలో మాత్రమే విద్యుత్ ఉత్పత్తి చేపట్టాలని నిర్ణయించాయి.

మూడు జలవిద్యుత్ కేంద్రాలకు..

సీలేరు విద్యుత్ కాంప్లెక్స్ పరిధిలో బలిమెల, గుంటవాడ, డొంకరాయి జలాశయాలతోపాటు ఫోర్‌బే స్టోరేజీ ట్యాంక్ ఉంది. వీటి పరిధిలో సీలేరు, డొంకరాయి, పొల్లూరు విద్యుత్ కేంద్రాలు ఉన్నాయి.

- డొంకరాయి జలాశయం నిల్వ సామర్థ్యం 15 టీఎంసీలు, ప్రస్తుతం 3 టీఎంసీలు మాత్రమే నీరు ఉంది.
- సీలేరు ప్రాజెక్టు గుంటవాడ జలాశయం పూర్తిస్థాయి సామర్థ్యం 3.4 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.8 టీఎంసీలు (ఒక టీఎంసీ కంటే తక్కువ) నీటి నిల్వ మాత్రమే ఉంది.
- ఆంధ్రా, ఒడిశా ఉమ్మడి ప్రాజెక్టు బలిమెల జలాశయంలో పూర్తిస్థాయి సామర్థ్యం 94.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 22 టీఎంసీలు నీటి నిల్వ మాత్రమే ఉంది.
- జ్వాలాపుట్ రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యం 32 టీఎంసీలు కాగా ప్రస్తుతం 13.5 టీఎంసీలు మాత్రమే నీరు ఉంది.

గోదావరి డెల్టాకు విడుదలతో..

సీలేరు కాంప్లెక్సు పరిధిలో జలాశయాల్లో నీటి మట్టం ఎన్నడూలేనివిధంగా అడుగంటి పోయింది. దీని ప్రభావం ఇప్పటికే విద్యుత్ ఉత్పత్తి చూపుతోంది. ఉభయ గోదావరి జిల్లాలకు రబీ అవసరాలకు సీలేరు జలాశయాల నుంచి 13 టీఎంసీల నీటిని విడుదల చేశారు. దీంతో జల విద్యుత్ కేంద్రాలకు నీటి సమస్య తలెత్తింది.

- నీటి సమస్యను అధిగమించేందుకు జెన్‌కో అధికారులు పొదుపుగా వాడుకుంటున్నారు. ప్రతిరోజు 1400 క్యూసెక్కుల నీటిని రెండు జలాశయాల నుంచి తీసుకుని పీక్‌లోడ్ అవర్స్‌లో మాత్రమే విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.
- రాష్ట్రంలో ఎక్కడాలేనివిధంగా సీలేరు కాంప్లెక్సు పరిధిలో మాత్రమే జలవిద్యుత్ కేంద్రాలు తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేస్తున్నాయి.
- మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో ప్రస్తుతం ఆరు యూనిట్లలో నాలుగు మాత్రమే పనిచేస్తున్నాయి. రెండు యూనిట్లు మరమ్మతుల్లో ఉన్నాయి.
- సీలేరు ప్రాజెక్టులో నాలుగు యూనిట్లలో మూడు మాత్రమే పనిచేస్తున్నాయి.
- పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో పీక్ అవర్స్‌లో మాత్రమే నాలుగు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి అవుతోంది.
- గత ఆర్థిక సంవత్సరంలో డొంకరాయి జలాశయం మాత్రమే పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేయగలిగింది. మిగిలిన మూడు ప్రాజెక్టులు లక్ష్యాన్ని చేరుకోలేకపోయాయి.

పొదుపుగా నీటి వాడకం

సీలేరు కాంప్లెక్సులోని జలాశయాల్లో నీటి నిల్వలు తక్కువ ఉన్నా యి. అందువల్ల జలవిద్యుత్ ఉత్పత్తి పొదుపుగా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. గుంటవాడ, డొంకరాయి జలాశయాలకు బలిమెల నుంచి రోజుకు 1400 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నాం. పీక్‌లోడ్ అవర్స్‌లో మాత్రమే ఉత్పత్తి చేస్తున్నాం.

– ప్రశాంత్‌కుమార్, ఎస్ఈ , ఏపీ జెన్‌కో, మోతుగూడెం

అనుమానాస్పద మృతి కేసులో ఒకరి అరెస్టు

- కాల్ డేటా ఆధారంగా ఛేదించిన పోలీసులు

8లో

చాపరాయి అభివృద్ధికి చర్యలు



చాపరాయి జలపాతాన్ని పరిశీలిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



అరకులో నిర్మాణ దశలోని కాటేజీలను పరిశీలిస్తున్న పీవో అభిషేక్

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ అన్నారు. గురువారం మండల కేంద్రానికి వచ్చిన ఆయన చాపరాయి జలపాతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ విదేశాల నుంచి తిలకించేందుకు వస్తున్న పర్యాటకులకు అనువుగా చాపరాయి జలపాతంలో వసతులు కల్పిస్తామన్నారు. గార్డెన్, చిన్నపిల్లల ఆట వస్తువులు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. కాటేజీల నిర్మాణం, సుందరీకరణ పనులు సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. గిరిజన మ్యూజియం మేనేజర్ మురళి, డిప్యూటీ తహసీల్దార్ ముజీబ్ పాల్గొన్నారు.

త్వరితగతిన పనులు

అరకులోయ రూరల్: ఐటీడీఏ పరిధిలో జరుగుతున్న పర్యాటక అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ అధికారులను ఆదేశించారు. అరకు పద్మాపురం గార్డెన్‌లో నిర్మిస్తున్న ట్రీహట్స్, కొత్తవలస హెచ్ఎన్‌టీసీ పనులను ఆయన పరిశీలించారు. గిరిజన సంక్షేమ శాఖ డీఈ సుబ్బారావు పాల్గొన్నారు.

అదుపుతప్పి జీపు బోల్తా

- ముగ్గురికి తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం
- కుజభంగి జంక్షన్ సమీపంలో ఘటన



కుజభంగి సమీపంలో బోల్తా పడిన జీపు



పరిస్థితి విషమంగా ఉన్న చెండా తోయజాక్షి



తీవ్రంగా గాయపడిన కోదండ

ముంచంగిపుట్టు/పెదబయలు: ముంచంగిపుట్టు మండలంలోని కుభజంగి కూడలికి సమీపంలో గురువారం సాయంత్రం జీపు బోల్తాపడిన ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మండలంలోని కుభజంగి నుంచి ముగ్గురు ప్రయాణికులతో పెదబయలు బయలుదేరింది. కుభజంగి జంక్షన్ సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. ఈఘటనలో జీపులో ఉన్న పెదబయలు మండల కేంద్రానికి చెందిన చెండా తోయజాక్షి, లక్ష్మీపేట పంచాయతీ కప్పాడ గ్రామానికి చెందిన వంతాల సంతోష్, విజయనగరం జిల్లా కోడాన గ్రామానికి చెందిన కె. కోదండ తీవ్రంగా గాయపడ్డారు. జీపు డ్రైవర్ చెండా బాలకృష్ణకు స్వల్పగాయాలయ్యాయి.

అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా..

పాడేరు ఘాట్‌లో బుధవారం రాత్రి జరిగిన కారు ప్రమాదంలో మృతి చెందిన దంపతులు చెండా సుబ్బారావు, మహేశ్వరిలకు కిలగాడ గ్రామంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెళ్లి వస్తుండగా జీపు ప్రమాదానికి గురైంది. క్షతగాత్రులు తోయజాక్షి, కె.కోదండ, నవీన్‌లను పెదబయలు పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం ముగ్గురిని పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఉపాధ్యాయిని తోయజాక్షి పరిస్థితి విషమంగా ఉందని పెదబయలు వైద్యాధికారి సిందూరం పడాల్ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాడేరులో నర్సింగ్ విద్య

- కళాశాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి
- అందుబాటులో వంద సీట్లు
- రూ.10 కోట్లు మంజూరు
- ఇప్పటికే చేపట్టిన భవన నిర్మాణ పనులు



పాడేరులో నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాల బ్లాక్ నిర్మాణ పనులు

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రమైన పాడేరులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.500 కోట్లతో మెడికల్ కళాశాలను నిర్మిస్తున్నాయి. ఈ మెడికల్ కళాశాలలో నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది.ఇందుకుగాను ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు వంద సీట్లతో నర్సింగ్ విద్య అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం పాడేరు మెడికల్ కళాశాలలోని అన్ని విభాగాల భవన నిర్మాణ పనులు చురుగ్గానే జరుగుతున్నాయి. నర్సింగ్ కళాశాలకు సంబంధించి 1600, హాస్టల్ భవనాన్ని 600 స్క్వేర్ మీటర్లలో ఇప్పటికే నిర్మిస్తున్నారు. వీటి నిర్మాణ పనులను కూడా ఈఏడాది డిసెంబర్ నెలాఖరుకు పూర్తిచేసే లక్ష్యంతో ఎన్‌సీసీ నిర్మాణ సంస్థ ఉంది. ఇప్పటివరకు కళాశాల భవనంలో నాలుగు అంతస్తుల వరకు పనులు జరిగాయి. దీనివెనుక భాగంలో హాస్టల్ భవన నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి.

సర్వత్రా హర్షం

గిరిజన ప్రాంతాల్లో యువతీ యువకులకు స్థానికంగానే నర్సింగ్ విద్యను అందుబాటులో తెస్తుండడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పటివరకు నర్సింగ్ విద్యకు సంభందించి మైదాన ప్రాంతాల్లోని రాజమహేంద్రవరం, కాకినాడ, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారు. స్థానికంగా వైద్యవిద్య అందుబాటులో వస్తుండడంతోవ విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గిరి యువతకు మేలు



గిరి యువతీ యువకులకు నర్సింగ్ విద్యపై ఆసక్తి ఉంది. గిరిజన యువతులు ఇప్పటికే నర్సింగ్ విద్య ద్వారా ఉద్యోగాలు పొంది ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. అయితే పాడేరు మెడికల్ కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాలను మంజూరు చేయడంతో నర్సింగ్ కోర్సులకు దూర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బందులు తొలగనున్నాయి. అన్ని సౌకర్యాలతో కూడిన ఉచిత నర్సింగ్ విద్యను అందుబాటులోకి రానుండటం సంతోషంగా ఉంది.

– డాక్టర్ కె.కృష్ణారావు, జిల్లా ఆస్పత్రి, సూపరింటెండెంట్, పాడేరు

దంపతులకు కన్నీటి వీడ్కోలు



కిలగాడలో దంపతులకు అంతిమయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు, బంధువులు..



పండుగలో సుబ్బారావును సత్కరిస్తున్న కిలగాడ గ్రామస్తులు (ఫైల్)

ముంచంగిపుట్టు: పాడేరు ఘాట్‌లో కారు ప్రమాదంలో మృతి చెందిన దంపతులు సుబ్బారావు, మహేశ్వరిలకు అశ్రునయనాలతో గురువారం స్వగ్రామం కిలగాడలో అంత్యక్రియలు నిర్వహించారు. విశాఖపట్నంలోని ఎల్ఐసీలో పనిచేస్తున్న సుబ్బారావుకు ఇటీవల పదోన్నతి లభించింది. ఆ సంతోషంలో దంపతులు స్వగ్రామంలోని గంగమ్మతల్లి ఉత్సవాలకు విచ్చేశారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పదోన్నతి లభించిన ఆయనను గ్రామస్తులు సత్కరించారు. ఈ కార్యక్రమం జరిగిన తరువాత దంపతులు కారులో విశాఖ బయలుదేరారు. కాసేపటికే రోడ్డు ప్రమాదంలో వారు ప్రాణాలు కోల్పోవడాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. పోస్టుమార్టం అనంతరం గురువారం పాడేరు జిల్లా ఆస్పత్రి నుంచి దంపతుల భౌతికకాయాలను కిలగాడ గ్రామానికి తీసుకువచ్చారు. దీంతో కుటుంబసభ్యులు, బంధువులు, మండల వాసులు బరువెక్కిన హృదయాలతో వారికి నివాళులర్పించి అంత్యక్రియలు నిర్వహించారు. ఇలావుండగా సుబ్బారావు సోదరుడు మోహన్‌రావు కానిస్టేబుల్‌గా పనిచేస్తూ పక్షవాతంతో మృతి చెందారు. మరో సోదరుడు చెండా మురళి హెచ్‌పీసీఎల్‌లో పనిచేస్తూ గ్యాస్ ప్రమాదంతో మృతి చెందారు. సుబ్బారావు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం విషాదం నింపింది.

పొంగిన వాగులు, గెడ్డలు

ఏజెన్సీలో భారీ వర్షం



అనంతగిరిలో ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ



పొంగి ప్రవహిస్తున్న సంపంగి గెడ్డ



మాలింగవలస ప్రాంతంలో గెడ్డ వద్ద వేచి ఉన్న విద్యార్థులు

అనంతగిరి: మండలంలోని మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతీవ్రత అధికంగా ఉండడంతో మండలవాసులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. సుమారు నాలుగు గంటల పాటు కురిసిన వర్షానికి రహదారులు జలమయం అయ్యాయి. గెడ్డలు, వాగులు పొంగి ప్రవహించాయి. వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ అంతరాయం ఏర్పడింది. వర్షపునీటితో పంటపొలాలు కళకళలాడాయి.

వంతెనలేక కష్టాలు

పెద్దూరు గ్రామంలోగల ఎంపీపీ పాఠశాలకు వచ్చి, తిరిగివెళ్లేందుకు మాలింగవలస, పాతకోట గ్రామాలకు చెందిన, గిరిజన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మాలింగవలస గ్రామ సమీపంలోని గెడ్డపై వంతెన లేకపోవడంతో వెళ్లేందుకు అవస్థలకు గురయ్యారు. తల్లిదండ్రులు వచ్చి, గెడ్డను దాటించుకుంటూ విద్యార్థులను తీసుకువెళ్లారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాతకోట రహదారి, వంతెన నిర్మాణం చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

పొంగిన సంపంగి గెడ్డ

డుంబ్రిగుడ: మండలంలోని కించుమండ గ్రామ సమీపంలో గురువారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి కించుమండ సమీపంలోని సంపంగి గెడ్డ ఉప్పొంగి ప్రవహిస్తోంది. గెడ్డ పొంగి ప్రవహించడంతో ఆ ప్రాంతం గిరిజనులు గెడ్డలు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని శరభవరంలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు వీయడంతో జీడిమామిడి పంటకు నష్టం జరిగిందని రైతులు తెలిపారు. దాదాపు గంటన్నరకు పైగా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది.

త్వరితగతిన పనుల పూర్తి



కల్వర్టును పరిశీలిస్తున్న పీవో ధనుంజయ్ గనోరే

చింతూరు: మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం నిమిత్తం చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే ఆదేశించారు. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఇంజనీరింగ్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. చింతూరు మండలంలో మిట్టవాడ నుంచి జిన్నెలగుంపు వరకు రూ.15 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న 520 మీటర్ల మెటల్ రహదారిని ఆయన పరిశీలించారు. వీఆర్ పురం మండలం జల్లివారిగూడెం, బంగారుగూడెం నడుమ వాగుపై రూ.35 లక్షలతో నిర్మిస్తున్న కల్వర్టును కూడా పీవో పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని, నిబంధనల మేరకు పనులు త్వరితగతిన చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. ఏఈలు తరుణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు పెంచాలి

జిల్లా క్షయ నియంత్రణ అధికారి విశ్వేశ్వరనాయుడు



క్షయ రోగుల సేవల వివరాలను తెలుసుకుంటున్న విశ్వేశ్వరనాయుడు

కూనవరం/చింతూరు: ప్రభుత్వాస్పత్రుల్లో క్షయ నిర్ధారణ పరీక్షలు పెంచాలని జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ విశ్వేశ్వర నాయుడు ఆదేశించారు. చింతూరు, కూనవరం మండలాల్లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏడుగురాళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రతినిధి బృందంతో కలసి పర్యవేక్షించారు. రికార్డులు పరిశీలించారు. క్షయ రోగులకు అందుతున్న సేవలగురించి ఆరాతీశారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉన్న ప్రతీరోగిని కళ్లె పరీక్ష చేయాలని సూచించారు. క్షయ రోగులకు కావలసిన మందులు అందుబాటులో ఉంచాలని, రోగులు క్రమం తప్పకుండా మందులు వాడుతున్నారా అనే సమాచారం వైద్య సిబ్బందితోపాటు టీబీ సూపర్‌వైజర్లు తెలుసుకోవాలని సూచించారు. క్షయ రోగులు తగినంత పౌష్టికాహారం తీసుకోకపోతే జరిగే నష్టంపై అవగాహన కల్పించాలన్నారు. క్షయ రోగుల సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతోపాటు జిల్లా అధికారులకు ప్రతీరోజు సమాచారం పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌వో కన్సల్‌టెంట్ డాక్టర్ విఘ్నేష్, డీటీసీ శ్రీనివాసరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, చింతూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి, ఏడుగురాళ్లపల్లి పీహెచ్‌సీ వైద్యుడు ఉదయ్ కుమార్, టీబీ సూపర్‌వైజర్ రామాంజనేయులు, భారతి, సుబ్బారావు, ఎల్‌టీలు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి పరిశీలన



వంతెన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న పీఆర్ ఏఈఈ మురళీకృష్ణ, సర్పంచ్ త్రినాథ్

ముంచంగిపుట్టు: మండలంలో గల మారుమూల లక్ష్మీపురం పంచాయతీ కర్లపోదర్ గ్రామ సమీపంలో వంతెన నిర్మాణానికి కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలతో గురువారం పీఆర్ ఏఈఈ మురళికృష్ణ, సర్పంచ్ త్రినాథ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శిరీషలు పరిశీలించారు. వర్షాకాలంలో వాగు నీటి ఉధృతపై ఆరా తీసి, దానికి అనుగుణంగా వంతెన నిర్మాణం చేసేందుకు ఇరువైపులా కొలతలు తీశారు.ఈ సందర్భంగా పిఆర్ ఏఈఈ మురళికృష్ణ మాట్లాడుతూ స్పందనలో కర్లపోదర్ వంతెన నిర్మించాలని, వంతెన లేక వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు కలెక్టర్‌కు సర్పంచ్ తెలియజేయడంతో వంతెన నిర్మాణానికి అవసరమైన ప్రదేశాన్ని పరిశీలించినట్టు ఆయన తెలిపారు.

అరకు కాఫీ అవుట్‌లెట్స్!

- రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో ఏర్పాటుకు సన్నాహాలు
- అందుబాటులో ఇన్‌స్టెంట్, ఫిల్టర్ కాఫీలు
- తొలివిడతగా విశాఖ పరిసరాల్లో ఏర్పాటు చేసేందుకు కసరత్తు



సాక్షి, విశాఖపట్నం : సేంద్రీయ పద్ధతుల్లో తయారయ్యే అరకు కాఫీ అంటే తెలియనివారంటూ ఎవరూ ఉండరు. ఏజెన్సీలోని వాతావరణమే అరకు కాఫీ రుచికి ప్రధాన కారణమన్నది మెటరాలజీ విభాగ నిపుణులు తేల్చిచెప్పారు. ఇక్కడ పండే అరబికా రకం కాఫీ.. పారిస్, జపాన్, దక్షిణ కొరియా, స్విట్జర్లాండ్ దేశాల్లోని నగరాల ప్రజలూ దీని రుచికి సలాం కొట్టారు అందుకే.. 2018లోనే బ్రెజిల్, సుమత్రా, కొలంబోతో పాటు ఇతర దేశాల్ని వెనక్కి నెట్టేసి.. ఫ్రిక్స్ ఎపిక్యూర్-2018 పోటీల్లో అరకు కాఫీ బంగారు పతకాన్ని సాధించింది. ఇప్పుడు అరకు కాఫీ అవుట్‌లెట్స్ రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రధాన నగరాల్లో ప్రారంభించాలని జీసీసీ భావిస్తోంది.

అన్ని కాఫీలకు దీటుగా..

ప్రస్తుతం కాఫీ అవుట్‌లెట్స్ నగరాల్లో పుట్టగొడుగుల్లా విస్తరిస్తున్నాయి. కుంభకోణం, మద్రాస్ ఫిల్టర్ కాఫీ, కోయంబత్తూర్.. ఇలా విభిన్నమైన కాఫీ అవుట్‌లెట్స్ కనిపిస్తున్నాయి. వాటికి కాఫీ ప్రియుల నుంచి ఆదరణ విపరీతంగా ఉంటోంది. వాటన్నింటికంటే అద్భుతమైన రుచి ఉన్న అరకు కాఫీని కూడా అదే మాదిరిగా ప్రజలు ఆస్వాదించాలనే ఉద్దేశంతో అవుట్‌లెట్స్‌ని ఏర్పాటు చేయాలని జీసీసీ భావిస్తోంది. అరకు కాఫీ రుచిని అందరికీ అందించనుంది. ఇందుకోసం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో మొదటగా అరకు కాఫీ అవుట్‌లెట్స్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఫిల్టర్ కాఫీ, ఇన్‌స్టెంట్ కాఫీతో పాటు భిన్నమైన కాఫీ రుచుల్ని ఈ అవుట్‌లెట్స్‌లో అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇప్పటికే జీసీసీ కాఫీ అవుట్‌లెట్‌ని ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. అదేమాదిరిగా నగరాల్లోనూ సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా అవుట్‌లెట్స్‌ని సిద్ధం చేయనున్నారు. ఇందుకోసం స్థల అన్వేషణ మొదలు పెట్టాలని ఇటీవల జరిగిన బోర్డు సమావేశంలో జీసీసీ అధికారులు చర్చలు జరిపారు.

గిరిజనులకు ఉపాధి అవకాశాలు



అరకు కాఫీ అవుట్‌లెట్స్ ఏర్పాటుపై బోర్డు సమావేశంలో ప్రతిపాదనల్ని తీసుకొచ్చాను. దీనిపై అధికారులు చర్చలు జరిపారు. పైలట్ ప్రాజెక్టుగా విశాఖ నగరంలో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నాం. ఇక్కడ విజయవంతమైతే రాష్ట్రంలోని ఇతర నగరాలకు విస్తరించనున్నాం. అవుట్‌లెట్స్ ద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

– శోభా స్వాతిరాణి, జీసీసీ చైర్‌పర్సన్

కారు ప్రమాదంలో ముగ్గురి మృతి బాధాకరం

అరకు ఎమ్మెల్యే పాల్గుణ



మహేశ్వరి భౌతికకాయం వద్ద విషణ్ణవదనంతో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి,పాడేరు: పాడేరు ఘాట్ రోడ్డులోని బుధవారం జరిగిన కారు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందిన సంఘటనపై అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన గిరిజన దంపతులు చెండా సుబ్బారావు, నాగమహేశ్వరితో పాటు డ్రైవర్ మహేశ్వరరెడ్డి మృతదేహాలను పాడేరు జిల్లా ఆస్పత్రిలోని మార్చురిలో భద్రపరిచారు. ఆస్పత్రిని గురువారం ఉదయం అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సందర్శించారు. మార్చురీలోని రోడ్డు ప్రమాద బాధిత భౌతికకాయాలను సందర్శించి, విచారం వ్యక్తం చేశారు. కిలగాడలో పండగకు వచ్చి తిరిగి విశాఖలో తమ ఇంటికి వెళ్లే సమయంలో కారుప్రమాదంలో మృతి చెందడంపై కన్నీటి పర్యంతమయ్యారు. ఎల్ఐసీ సంస్థలో డివిజనల్ మేనేజర్‌గా పనిచేస్తున్న కిలగాడ గ్రామానికి చెందిన సుబ్బారావు కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో తీవ్ర గాయాలైన సమరెడ్డి పుర్ణారావుకు మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కష్టారావు, సిబ్బందికి సూచించారు. పెదబయలు జెడ్పీటీసీ సభ్యుడు కూడా బొంజుబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, నాయకులు ప్రమాద ఘటనపై విచారం వ్యక్తం చేశారు.

మోదకొండమ్మ జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు



మోదకొండమ్మ ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ, నాయకులు

హుకుంపేట: గిరిజనుల ఆరాధ్య దైవం మోదకొండమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చెప్పారు. మండల కేంద్రంలోని మోదకొండమ్మ అమ్మవారి ఆలయం ప్రాంగణంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో వచ్చే నెల 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న మోదకొండమ్మ అమ్మవారి జాతర పోస్టర్‌ను స్థానిక నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, సర్పంచ్‌లు వెంకట పూర్ణిమ, రమేష్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అనిల్, మాజీ ఎంపీపీ, మాజీ జెడ్పీటీసీలు రవిప్రసాద్, కాసులమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు గోవింద్, సూరిబాబు, ఇతర పార్టీ నేతలు సూర్యకాంతం, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతి కేసులో ఒకరి అరెస్టు


- వివరాలు వెల్లడించిన సీఐ సుధాకర్



హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చూపిస్తున్న సీఐ సుధాకర్, పక్కన ఎస్ఐ లక్ష్మణరావు

పాడేరు రూరల్ : ఇటీవల జరిగిన ఓ అనుమానస్పద మృతి కేసును పాడేరు పోలీసులు ఛేదించారు. ఈ వివరాలను పాడేరు సీఐ సుధాకర్ గురువారం సాయంత్రం పాడేరులో విలేకరులకు వెల్లడించారు. ముంచంగిపుట్టు మండలం దారెల పంచాయతీ చివుకుచింత గ్రామానికి చెందిన సమరెడ్డి ప్రీతి అనే మహిళ జి.మాడుగుల మండలం నేరోడువలస గ్రామానికి చెందిన లొంజ ఉద్రాక్ష హరి విజయ్‌ను 2014లో ప్రేమించి వివాహం చేసుకుంది. వీరికి ఓ పాప ఉంది. ప్రీతి తన భర్త, కుమార్తెతో కలిసి చోడవరంలోని మారుతీనగర్‌లో తన తండ్రి సమరెడ్డి శంకర్‌రావు ఇంటి వద్ద నివాసం ఉంటోంది. భార్యాభర్తలు ఇటీవల కొద్దికాలంగా తరచుగా ఫైనాన్స్ వ్యాపారం విషయమై గొడవ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 18న ఉదయం 7.30 గంటల సమయంలో ప్రీతి తన భర్త అనారోగ్యంతో ఉన్నాడని, పాడేరు జిల్లా ఆస్పత్రిలో చేర్చానని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని పాడేరు ఎస్ఐకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ లక్ష్మణరావు దీనిపై అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పాడేరు సీఐ సుధాకర్, ఎస్ఐ లక్ష్మణరావు కేసును లోతుగా దర్యాప్తు జరిపారు. అనుమానితుల కాల్ డేటాతో పాటు పోస్టుమార్టం తొలి రిపోర్ట్ ఆధారంగా కేసును ఛేదించారు. లొంజ ఉద్రాక్ష హరి విజయ్‌ను చోడవరంలోని మారుతీనగర్‌లోని వారి ఇంటి వద్ద ప్రీతి తండ్రి సమరెడ్డి శంకర్‌రావు, మరికొంత మందితో కలిసి హత్య చేసి ఎవరికీ అనుమానం రాకుండా పాడేరు జిల్లా ఆస్పత్రిలో చేర్చి సాధారణ మరణంగా సృష్టించే ప్రయత్నం చేశారు. కానీ పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు వెల్లడి కావడంతో హత్య కేసుగా నిర్ధారించి ప్రీతి తండ్రి శంకర్‌రావును గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ సుధాకర్ తెలిపారు. పాడేరు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు ఈ కేసు తదుపరి దర్యాప్తును చోడవరం పోలీసులకు బదిలీ చేశామన్నారు.

జలాశయంలో పడి బాలుడి మృతి



జలాశయంలో తేలిన బాలు మృతదేహం

అడ్డతీగల : అడ్డతీగలలోని మద్దిగడ్డ జలాశయంలో బోర్లా పడి ఉన్న మృతదేహాన్ని గురువారం స్థానికులు గమనించి పోలీసులకు తెలియజేశారు. వెంటనే సంఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు ఆరా తీయగా మృతుడు అడ్డతీగలోని సీతారామరాజు కాలనీకి చెందిన నేబుల బాలు(13)గా గుర్తించారు. చేపలు పట్టుకోవడానికి ఇంటి వద్ద చెప్పకుండా జలాశయం వద్దకు వెళ్ళి ప్రమాదవశాత్తూ అందులో పడి మరణించినట్టుగా చెబుతున్నారు. కాగా జలాశయం ఒడ్డున ఒక చేతి సంచి దానికి అనుబంధంగా ఒక తాడు మృతదేహానికి దగ్గరలో నీటిలో చెప్పులు కనిపించాయి. సీతారామరాజు కాలనీకి చెందిన మృతుని తల్లిదండ్రులైన నేబుల శ్రీను, ధనలక్ష్మి కూలి పనులు చేసుకుని జీవిస్తుంటారు. మృతుడు నేబుల బాలు ఇంటి వద్ద చెప్పకుండా చేపల వేటకు వెళ్ళినట్టు పోలీసులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అడ్డతీగల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ ఫలితాల్లో శశి విద్యార్థుల సత్తా

తగరపువలస : ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో సంగివలస శశి క్యాంపస్‌కు చెందిన విద్యార్థులు సత్తా చాటారని చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. సెకండియర్ ఎంపీసీలో బి.సాయిప్రణీత 988, కె.తేజభరత్ 987, ఇ.గౌతమ్, కె.వి.ఎస్.చైతన్య, పి.నాగసాయి నిఖిత, బి.చరణ్‌లు 986 చొప్పున మార్కులు సాధించారన్నారు. 980కు పైగా మార్కులు 37 మంది, 970కు పైగా మార్కులు 91, 950కు పైగా మార్కులు 62 మంది విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను వై.ప్రశాంతి, నాగసాయిరామ్, పి.పూజితరామ్, సిహెచ్ హరిసాత్విక, పి.వి.వర్ధన్ 465 మార్కుల చొప్పున సాధించారన్నారు. 460కు పైగా మార్కులు 85 మంది, 450కు పైగా 218 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను కేటీ షణ్ముఖ శ్రీ, బి.శ్రీవల్లి, వై.తేజశ్రీ 435 చొప్పున మార్కులు సాధించారన్నారు. 430కు పైగా మార్కులు 19 మంది, 400కు పైగా 81 మంది విద్యార్థులు సాధించి సత్తా చాటారన్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన అధ్యాపక బృందాన్ని అకడమిక్ డైరెక్టర్ మేకా క్రాంతిసుధ అభినందించారు.

గంజాయి కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

అనకాపల్లిటౌన్ : గంజాయి కేసులో పరారైన ఇద్దరు నిందితులను గురువారం ఉదయం అనకాపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో అదుపులోనికి తీసుకుని కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్.నరసింగరావు చెప్పారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు...ఈనెల 22 తేదీన మండలంలో బవులవాడ గ్రామంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో 34 కిలోల గంజాయి తరలిస్తూ పరారైన తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు చెందిన మోదెం సైలీస్(19), తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా శివనగర్‌కు చెందిన మజ్జిగ అజయ్(20) గురువారం అనకాపల్లి రైల్వే స్టేషన్ నుంచి పాడేరు వెళుతుండగా రైల్వే స్టేషన్ సమీపంలో అదుపులోనికి తీసుకున్నట్టు ఎస్ఐ చెప్పారు. ఈ మేరకు ఇద్దరినీ కోర్టులో హాజరుపర్చడం జరిగిందన్నారు.

'లైంగికదాడి నిందితుడిని అరెస్టు చేయాలి'

చోడవరం రూరల్: చీడికాడ పోలీస్ స్టేషన్ పరిధి వరహాపురం గ్రామంలో మహిళపై లైంగికదాడికి పాల్పడ్డ నిందితుడు యలమంచిలి చిన్నను తక్షణమే అరెస్టు చేయాలని సీఐటీయూ అనుబంధ మహిళా సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి ఆధ్వర్యంలో చోడవరంలో నిరసన చేపట్టారు. ఈ నెల 13న చోటుచేసుకున్న ఈ ఘటనలో చీడికాడ పోలీసులు నిందితుడిని స్టేషన్ బెయిల్‌పై వదిలిపెట్టారని ఆమె ఆరోపించారు. ఇప్పుడు తమకు ఆచూకీ లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తక్షణమే బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి దేముడునాయుడు, ఎలమంచిలి ఎర్రయ్య, నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో జాబ్‌మేళా రేపు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంప్లాయిమెంట్ బ్యూరోలో ఈ నెల 29న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆచార్య పి.అర్జున్ తెలిపారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్ సంస్థలో ట్రైనీ కెమిస్ట్, సీనియర్ కెమిస్ట్ ఉద్యోగాలు భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. బీఎస్సీ కెమిస్ట్రీ, బీటెక్ కెమికల్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. జూనియర్ కెమిస్ట్‌కి నెలకు రూ.19,474, సీనియర్ కెమిస్ట్‌కి ఏడాదికి రూ.3.5 లక్షలు వార్షిక వేతనంగా అందిస్తారన్నారు. 18 నుంచి 27 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. అలాగే అపోలో ఫార్మసిస్టులుగా 40 మందిని నియమిస్తుందని, బీఫార్మసీ చేసినవారు అర్హులని తెలిపారు. రిటైల్ ట్రైనీ అసోసియేట్‌గా 20 ఖాళీలు భర్తీ చేస్తారని చెప్పారు. పదో తరగతి అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగిన అర్హులన్నారు. ఎన్‌డీటీ అసిస్టెంట్ ఉద్యోగాలకు పదో తరగతి, అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగిన వారు అర్హులని తెలిపారు. వివరాలకు 96660 92491, 83670 48979 నంబర్లలో సంప్రదించాలన్నారు.

క్రికెట్ స్కోరర్‌గా వేణుమాధవ్

తుమ్మపాల : సౌత్ ఏషియన్ ఒలింపిక్స్ క్రికెట్ మ్యాచ్‌ల స్కోరర్‌గా అనకాపల్లికి చెందిన క్రికెటర్ కేఎస్‌వీపీ వేణుమాధవ్ ఎంపికయ్యారు. అనకాపల్లిలో గుడ్ ఫ్రెండ్స్ క్లబ్, శారదా క్రికెట్ క్లబ్‌ల ద్వారా 28 ఏళ్లుగా క్రికెట్‌కు ఆయన విశేష సేవలందిస్తున్నారు. సింగపూర్ నుంచి ఒలింపిక్స్ స్కోరర్‌గా ఆయన ఎంపిక పట్ల పట్టణంలోని పలువురు అభినందనలు తెలిపారు.

వృద్ధుల హెల్ప్‌లైన్ పోస్టర్ ఆవిష్కరణ

సాక్షి,పాడేరు: జాతీయ వృద్ధుల హెల్ప్‌లైన్ పోస్టర్‌ను డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా గురువారం ఆవిష్కరించారు.14567 హెల్ప్‌లైన్ నంబర్‌ను వయో వృద్ధులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. భావోద్వేగ సహాయం, సమాచారం, తల్లిదండ్రులు-వృద్ధుల చట్టాలు, వ్యక్తిగత, కుటుంబ సమస్యలపై న్యాయసలహాలు, సూచనలు, క్షేత్రస్థాయిలో సహాయంకోసం 14567 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో హెల్ప్‌లైన్ ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి కె.ప్రసాద్,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఆవు మృతి



మృతిచెందిన ఆవు

కె.కోటపాడు : మండలంలో గవరపాలెం శివారు భూమిరెడ్డిపాలేనికి చెందిన భూమిరెడ్డి రాముకు చెందిన ఆవు పిడుగుపాటుకు గురై గురువారం సాయంత్రం మృతిచెందింది. మండలంలో సాయంత్రం పిడుగులతో కూడిన భారీ వర్షం పలు గ్రామాల్లో కురిసింది. రాముకు ఆవును కల్లం వద్ద గల చెట్టు కింద కట్టి ఉంచగా ఇదే సమయంలో ఉరుములతో కూడిన పిడుగు చెట్టుపై పడింది. దీంతో చెట్టు కింద ఉన్న ఆవు పిడుగుపాటుకు గురూ అక్కడిక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఆవు రూ.50వేలు విలువ చేస్తుందని బాధిత రైతు తెలిపారు.

విశాఖ పోర్టులో రికార్డు స్థాయి లోడింగ్

44.37 వేల మెట్రిక్ టన్నుల ఐరన్‌ఓర్ పెల్లెట్స్ హ్యాండ్లింగ్



పోర్టులో లోడింగ్ పనులు

సాక్షి, విశాఖపట్నం : మరో అరుదైన రికార్డును విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) తన ఖాతాలో వేసుకుంది. పోర్టు చరిత్రలో తొలిసారిగా అత్యధికంగా ఐరన్ ఓర్ పెల్లెట్స్ లోడింగ్ చేస్తూ రికార్డు సృష్టించింది. 44,374 మెట్రిక్ టన్నుల ఐరన్ ఓర్ పెల్లెట్స్‌ని గురువారం ఏకకాలంలో పార్సిల్ లోడింగ్ చేసినట్లు పోర్టు అధికారులు ప్రకటించారు. గతంలో 35,100 మెట్రిక్ టన్నుల లోడింగ్ మాత్రమే ఇప్పటి వరకూ రికార్డుగా ఉండేది. ఆ రికార్డుని అధిగమిస్తూ జల్ కల్పతరు కార్గో షిప్‌లో రికార్డు స్థాయిలో లోడ్ చేసినట్లు పోర్టు అధికారులు తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం



దగ్ధమైన తాటాకు ఇల్లును పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

నాతవరం : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి తాటాకు ఇల్లు పూర్తిగా కాలి బూడిదైన ఘటన నాతవరంలో చోటు చేసుకుంది. వివరాలివి. నాతవరం గ్రామానికి చెందిన పోలిరెడ్డి సత్తిబాబు, రుత్తల సత్తిబాబు, రుత్తల లక్ష్మి కుటుంబాలు తాటాకు వాసా ఇంటిలో నివాసం ఉంటున్నారు. గురువారం ఉదయం 10 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాప్తించడంతో ఇల్లంతా కాలిపోయింది. స్థానికులు నర్సీపట్నం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా, వాహనం వచ్చేలోపు ఇల్లంతా కాలిబూడిదైంది. ఆ సమయంలో ఇంట్లో వ్యక్తులు వివిధ పనులపై బయటకు వెళ్లడంతో ఇంట్లో వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. దుస్తులు, నిత్యావసర వస్తువులు టీవీ, ఫ్రిజ్ ఇతర వస్తువులు పని రాకుండా మాడిపోయాయి. సర్వం కోల్పోడంతో బాధితులు భోరున విలపిస్తున్నారు. జరిగిన ప్రమాదంపై వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, వీఆర్వో బొత్సా శ్రీనివాస్ సంఘటన ప్రదేశాన్ని పరిశీలించారు. అగ్నిప్రమాదంలో నష్టం రూ.3 లక్షలకు పైగా ఆస్తి నష్టం ఉంటుందని భావిస్తున్నారు.

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న సీఐ అశోక్‌కుమార్

గూడెంకొత్తవీధి: జీవితాలను నాశనం చేసే గంజాయి మహమ్మారిని మన్యంనుంచి శాశ్వతంగా నిర్మూలించేందుకు ప్రభుత్వం, పోలీసుశాఖ అన్ని రకాల చర్యలూ తీసుకుంటోందని గూడెంకొత్తవీధి సీఐ అశోక్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో పలుశాఖల అధికారులతోపాటు మహిళాపోలీసులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గంజాయి సాగును నియంత్రించడంతోపాటు ప్రత్యామ్నాయంగా రైతులకు అధిక లాభాలనిచ్చే పంటలను ప్రోత్సహిస్తున్నామని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. వ్యవసాయ శాఖ పరంగా రైతులను గుర్తించి వారికి అవసరమైన విత్తనాలను సకాలంలో పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని మండల వ్యవసాయాధికారి మధుసూదనరావు తెలిపారు. ఈవోపీఆర్డీ పాపారావు పాల్గొన్నారు.

వేలంలో అప్పన్న దేవస్థానానికి రూ.1.22 కోట్లు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పలు వ్యాపారాల నిమిత్తం ఇచ్చిన లీజు హక్కుల ద్వారా సంవత్సరానికి రూ.కోటి 22లక్షల 38,183 ఆదాయం చేకూరింది. పలు వ్యాపారాల నిమిత్తం రెండేళ్ల కాలపరిమితి లీజు హక్కులు ఇచ్చేందుకు గురువారం బహిరంగ వేలం, సీల్డు టెండర్లు నిర్వహించారు. తొలుత ఏడాది కాలపరిమితికి హెచ్చుమొత్తానికి పాటని నిర్వహించి రెండో ఏడాది పదిశాతం హెచ్చుమొత్తంతో లీజులు పెంచుతారు. ఈమేరకు ఏడాది కాలపరిమితికిగాను కొండపై భక్తుల సెల్‌ఫోన్స్, కెమెరాలు భద్రపరిచే లీజు రూ.55,09,999లకు, సన్నిధిఫలాలు తీసుకునే లీజు 32లక్షలకు, కొండపైన, కొండదిగువ ఐస్‌క్రీమ్ బండ్ల లీజు రూ. 22,00,900లకు, శ్రీనివాసనగర్‌లోని దేవస్థానం భవనం అద్దె లీజు రూ.1.09,183కు, పైడితల్లి-బంగారమ్మ ఆలయాల్లో సన్నిధిఫలాలు, చీరలు తీసుకునే లీజు రూ.1,80,009కు, వరాహ పుష్కరిణి వద్ద కొబ్బరికాయలు విక్రయం లీజు రూ.4 లక్షలకు, గోపాలపట్నంలోని బుధవారం సంతలో ఆశీలు వసూలు లీజు రూ.1.37 లక్షలకు, బుధవారం సంత మినహా మిగతా రోజుల్లో ఆశీల వసూలు లీజ్ రూ.1.30 లక్షలకు, భైరవస్వామి ఆలయం వద్ద ఐస్‌క్రీమ్ విక్రయం చేసుకునే లీజ్ రూ.9,700లకు, సింహగిరిపై మిషన్లు ద్వారా కాఫీ, టీలు విక్రయం లీజ్ నెలకు రూ.30,116 హెచ్చుమొత్తానికి వెళ్లింది. కమిషనర్ ఆమోదం కోసం హెచ్చుమొత్తాల వివరాలను అధికారులు పంపించనున్నారు. దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్, శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు, సిబ్బంది చక్రవర్తి వేలం నిర్వహించారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



తులసీ కిరణ్ (ఫైల్)

అనకాపల్లి టౌన్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో తక్కువ మార్కులు వచ్చాయని నాగవంశం వీధికి చెందిన కె.తులసీ కిరణ్ (17) ఇంటిలో ఎవరూలేని సమయంలో సీలింగ్‌ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్ఐ సత్యనారాయణ అందించిన వివరాలు... తులసీ కిరణ్ గాజువాకలోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ చదువుతున్నాడు. 286 మార్కులతో పరీక్ష పాస్ అయినప్పటికీ తక్కువ మార్కులు వచ్చాయని మనస్తాపం చెందిన గురువారం ఆత్మహత్య చేసుకున్నట్లు కిరణ్ తండ్రి రామారావు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.